క్లుప్తంగా

ఘనంగా గణేశ్ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్

రేగోడ్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ చౌరస్తాలోని వెంకటసాయి, వరదలక్ష్మి రైస్ మిల్ సమీపంలో గణేశ్ ఆలయ మొదటి వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యాపారవేత్త శ్రీధర్ గుప్తా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంచారు. కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ యాదగిరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణి, నాయకులు నారాయణ, రమేశ్ గుప్తా, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తైబజార్ వేలం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట తైబజార్ వేలం ముగిసినట్లు పేట పట్టణ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ గ్రేస్‌బాయి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శుక్రవారం వేలం నిర్వహించగా 2024 – 25కు గాను పేటకు చెందిన ఎం.కిష్టయ్య తైబజార్‌ను రూ.8 లక్షల 1 వేయికి పాడినట్లు తహసీల్దార్ తెలిపారు. గత ఏడాది తైబజార్‌కు రూ.7 లక్షల 50 వేలు రాగా ఈ సారి రూ.51 వేలు పెరిగింది. దీంతో పాటు పశువుల సంత, కాంటా పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటరాములు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): ఎన్నికల దృష్ట్యా మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో హైవేపై వెళ్తున్న ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీం హెడ్ భిక్షపతి ఆధ్వర్యంలో సిబ్బంది, పోలీసులు తనిఖీలో పాల్గొన్నారు. ఈమేరకు తనిఖీ ప్రక్రియను వీడియో కవర్ చేయించినట్లు ఆయన తెలిపారు.

మాల మహానాడు పట్టణ కమిటీ ఏర్పాటు


నియామక పత్రం అందిస్తున్న జిల్లా నాయకులు

నర్సాపూర్: మాల మహానాడు నర్సాపూర్ పట్టణ కమిటీని నియమించినట్లు జాతీయ మాల మహానాడు జిల్లా శాఖ అధ్యక్షుడు సంజీవ, జిల్లా యువజన మాల మహానాడు అధ్యక్షుడు నరేశ్ శుక్రవారం తెలిపారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కుమార్, సహాయ కార్యదర్శిగా పోచయ్య, కోశాధికారిగా నరేశ్, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్‌లను నియమించినట్లు వారు చెప్పారు. వారితో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు భిక్షపతి, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై కళాజాత


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శంకర్

పెద్దశంకరంపేట(మెదక్): మూఢనమ్మకాలపై మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు పోలీసు కళా బృందం కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శంకర్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలతో పాటు షీటీం తదితర అంశాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సునీత, కళాబృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడిగా జానకిరామ్‌గౌడ్

మనోహరాబాద్: మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా భూమన్నగారి జానకిరామ్‌గౌడ్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం జానకిరామ్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందించారు. జానకిరామ్‌గౌడ్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును కలిసి శాలువతో సన్మానించారు.

పాఠశాలల్లో ప్రార్థన లేకపోవడం సిగ్గుచేటు

చిలప్‌చెడ్ మండల సమావేశంలో వైస్ ఎంపీపీ విశ్వంబర


మాట్లాడుతున్న ఎంపీపీ వినోదరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో ప్రార్థన కూడా చేయకపోవడం సిగ్గుచేటని వైస్ ఎంపీపీ విశ్వంబర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన, ఎంపీడీఓ ఆనంద్ సమక్షంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముసాద్దిక్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 70 కల్యాణలక్ష్మి చెక్కులు రావాల్సి ఉందన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అన్నారు. సీఆర్పీ రాజశేఖర్ మండల పాఠశాల వివరాల గురించి వివరిస్తుండగా, చిట్కుల్ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి అడ్డుకొని మండలంలో ఉపాధ్యాయులు సరైన సమయపాలన పాటించడం లేదన్నారు. ఏఈఓ భూపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో 11 రైతుబీమా దరఖాస్తులు అందగా, 8 మంది రైతులకు బీమా వచ్చిందని, ఈ సీజన్‌లో 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పోటాష్ అందుబాటులో ఉన్నాయన్నారు. విశ్వంబర మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో రైతులు అధిక మొత్తంలో పురుగు మందులు వాడుతున్నా.., సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం లేదన్నారు. కనీసం క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. మండలంలో మండలంలో చాలా వరకు విద్యుత్ సమస్యలు పరిష్కరించామన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జిల్లాలోనే అత్యధికంగా 3740 సర్వీసులకు సబ్సిడీ లభించిందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి బోర్లకు తప్పనిసరిగా మీటర్లు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పలు గ్రామాల వీధుల్లో పగలు లైట్లు వెలుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజా ప్రతినిధులు అన్నారు. పెరటి కోళ్ల పెంపకానికి డీడీలు కట్టి ఏడాదిన్నర దాటినా.. ఇప్పటి వరకు కోళ్లు రాలేదని వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్‌ను ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ మాట్లాడుతూ..గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పైప్‌లైన్లకు సంబంధించి చిన్న చిన్న మరమ్మతులను ఎంపీఓ చేయించాలన్నారు. ఎంపీఓ శరత్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేశామని, మండలంలో గ్రామాల్లో చిన్నవిగా ఉండడంతో నిధులు తక్కువగా వచ్చాయన్నారు. ఆరు నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఎంపీపీ వినోదరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు తప్పనిసరిగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా తమ విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ మధుబాబు, ఏపీఓ శ్యాంకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఏపీయం ప్రేమలత, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్‌కు మించి రుణాలు

డీపీఎం మోహన్

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండలంలో డ్వాక్రా సంఘాలకు టార్గెట్‌కు మించి రుణాలు ఇచ్చామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) మోహన్ అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండల ఐకేపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల బలోపేతం, తదితర అంశాల గురించి చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన డీపీఎం మోహన్ మాట్లాడుతూ.. మండలంలోని 526 సంఘాలకు 22 కోట్ల 34 లక్షల రుణాలు ఇవ్వాల్సి ఉండగా, టార్గెట్‌కు మించి 30 కోట్ల 66 లక్షల 7 వేల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మహిళ సంఘాలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తూ ఆర్థికాభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు పూర్తి చేయాలన్నారు. టైలరింగ్ వచ్చిన మహిళ సంఘాలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టేందుకు అవకాశం ఉందని సూచించారు. డిసెంబర్ నుంచి మార్చి వరకు సంఘాలకు రావాల్సిన వడ్డీ బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. డీజీఎం లల్లునాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, సమాఖ్య మండల అధ్యక్షురాలు నవనీత, కార్యదర్శి జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జలదినోత్సవం

రామాయంపేట(మెదక్): మంజీరా విద్యాలయంలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. నీటి ప్రాముఖ్యత, పొదుపుగా వాడుకోకపోతే జరిగే అనర్థాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు వాసవి, మౌనిక, సౌమ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మహిళ రైతుకు ఉచితంగా డ్రోన్


మల్కాపూర్‌లో మహిళా రైతుకు అందజేస్తున్న డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సుమారు రూ.9 లక్షలు విలువ చేసే డ్రోన్ పరికరాన్ని ఉచితంగా మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామానికి చెందిన మహిళా రైతు పిట్ల వరలక్ష్మికి గ్రోమోర్ కోరమండల్ సౌజన్యంతో కంపెనీ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల పొలాలకు, కూరగాయల పంటల సాగుకు క్రిమిసంహారక మందు పిచికారికి ఈ డ్రోన్ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సుమారు 20 రోజుల పాటు డ్రోన్ యంత్రంపై అధికారులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆమెను గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ స్వామి సన్మానించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాన్ని మహిళా రైతు తన నైపుణ్యంతో సాధించడానికి ప్రోత్సాహం అందించిన వరలక్ష్మి భర్త చెన్నయ్యను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

నాణ్యమైన భోజనం పెట్టడం లేదు

విద్యార్థుల ఆందోళన


వివరాలు తెలియజేస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి నాగరాజ్ గౌడ్

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు గురువారం రాత్రి ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి నాగరాజ్ గౌడ్ శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల ఆందోళనకు సంబంధించి విషయాన్ని విచారించారు. అక్కడి విద్యార్థులు, సిబ్బందితో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. వసతి గృహంలో వంట చేస్తున్న ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న నిర్వాహకులు సరైన భోజనం అందించడం లేదంటూ తన విచారణలో తెలిసిందన్నారు. సంబంధిత సిబ్బందిని కొడిపల్లికి బదిలీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ భాను సింగ్ ఉన్నారు.

చిరుధాన్యాల్లోనే ఎక్కువ పోషకాలు


పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిరుధాన్యాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని, ప్రతీ ఇంటిలో అందుబాటులో ఉంటే చిరుధాన్యాలు ఎక్కువగా తినాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఐకేపీ కార్యాలయంలో సీడీపీఓ హేమభార్గవి ఆదేశాల మేరకు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మహిళలతో పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యూట్రిషన్ ఫుడ్, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ఎలా తయారు చేసుకోవాలో సూచించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం తదితర విషయాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సర్వరోగ నివారణ

నర్సాపూర్ రూరల్: పోషకాహారంతో సర్వరోగ నివారణ అని అంగన్‌వాడీ టీచర్లు మంజుల, మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం పోషణ్ పక్వాడాలో భాగంగా మండలంలోని కాగజ్ మద్దూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూర్వకాలంలో పండగల సమయంలో చిరు ధ్యానాలతో తయారుచేసే వంటల్లో అన్ని రకాల పోషకాలు ఉండేవన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా మంచి ఆహారంతో పాటు ఆకుకూరలు, చేపలు, మాంసం, గుడ్లు, పాలు తీసుకుంటే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు ఆటపాటలతో కలిగే లాభాలను వివరించారు. అంగన్ వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజిలెన్స్ అధికారుల నియామకం

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని పరిశ్రమల వాడల నుంచి అక్రమ మట్టి రవాణా చేస్తున్న వారిని అడ్డుకునేందుకు విజిలెన్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అక్రమ మట్టి రవాణా కట్టడికి కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాళ్లకల్, కూచారం, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడలకు ఐలా కమిషనర్ తుల్జానాయక్(82973 84192), కొండాపూర్, రంగాయపల్లి వాడలకు ఎక్స్‌క్యూటివ్ ఆఫీసర్ వీరస్వామి(99593 33253)లను నియమించినట్లు తెలిపారు. అక్రమ మట్టి రవాణా చేస్తే వారి నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘనాపూర్‌లో శుక్రవారం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయి, నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటకు చెందిన అబ్బాయితో వివాహం నిశ్చయించారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో వారి వివాహం కోసం ఏర్పాట్లు చేశారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ రంగంపేట క్లస్టర్ సూపర్‌వైజర్ సంతోష, కొల్చారం పోలీసుల సహకారంతో గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వివాహ వయస్సు రాకముందు వివాహ చేయడం చట్టవిరుద్ధమని తెలియజేశారు. దీంతో వారు వివాహాన్ని నిలిపివేశారు.

ప్రవేశాలకు నేడు చివరి తేదీ

కొల్చారం(నర్సాపూర్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9 తరగతుల్లో మిగులు సీట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు శనివారం చివరి రోజని కొల్చారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఐదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతులకు పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిగా హర్షవర్ధన్, హెచ్‌ఎంగా గౌతమ్, ఉపాధ్యాయులుగా మానస, అవంతిక, దిలీప్, సృజన్, వర్షిత్, అనుదీపక్, జయంత్‌కుమార్, సుశాంత్, వినయ్, అఖిల్ వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సుమత పర్యవేక్షించారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు కవాతు


రెడ్డిపల్లిలో కవాతు చేస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు

అల్లాదుర్గం(మెదక్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు కవాతు నిర్వహించింది. గ్రామాల్లో ఏవైన సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు వెంటనే చేరుకోవడానికి ముందస్తుగా కవాతు నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి


చిలప్‌చెడ్‌లో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

నర్సాపూర్: కుమ్మర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో శాలివాహన గౌతమి పుత్ర శాతకర్ణి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి సురేశ్, సంఘం నాయకులు గణేష్, నగేష్, రమేశ్, అశోక్ పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి సంఘ సభ్యులతో కలిసి శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్యామ్, బాల్‌రాజ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి తైబజార్ వేలం వాయిదా

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మేజర్ పంచాయతీ తైబజార్ వేలం పాట వాయిదా పడింది. శుక్రవారం తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రకటించిన గ్రామ పంచాయతీ అధికారులు ఎన్నికల కోడ్ రావడంతో వేలం పాట వాయిదా వేశారు. ఈ విషయంపై నార్సింగి గ్రామపంచాయతీ ఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ రావడంతో వేలం పాట వాయిదా వేసినట్లు తెలిపారు.

వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి మాజీ సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శీలాంపల్లి గ్రామంలో ఆమె మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలసి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, యూత్ నాయకుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, విఠల్, భీమయ్య, వీరాస్వామి, శంకర్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డిని ప్రకటించడంపై మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. వారు పలువురు పార్టీ నాయకులు కలిసి శుక్రవారం మాట్లాడుతూ... మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డిని ఎంపిక చేసినందుకు గాను పార్టీ అధినేత కేసీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. కాగా వెంకట్రాంరెడ్డి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా జిల్లా ప్రజలకు సుపరిచితుడని, ఆయన కలెక్టర్‌గా పని చేసినప్పుడు చేసిన సేవలు జిల్లా ప్రజలు మరువలేదని అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో వెంకట్రాంరెడ్డికి మంచి మెజార్టీతో గెలుస్తారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు సత్యంగౌడ్, రాంచందర్, సూరారంనర్సింలు, బాల్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేష్, నాగరాజుగౌడ్, దావూద్, జ్ఞానేశ్వర్, నగేష్, మురళీ, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

మనోహరాబాద్(తూప్రాన్): నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతిని శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆమెను సన్మానించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలో పదో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చింత రాజిరెడ్డి, సత్యనారాయణ, రవి, యాదగిరి, ఎల్లారెడ్డి, రఘుపతి, మహేందర్‌రెడ్డి, రమేశ్, తిరుపతిగౌడ్, సంజయ్, నిశాంత్, అనిల్, గోవర్ధన్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కుషన్‌గడ్డ తండాకు చెందిన రవీందర్‌నాయక్‌కు రూ. 55వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కావడంతో శుక్రవారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్ బాధిత కుటుంబానికి అందజేశారు.

◆ టేక్మాల్ బీజేపీ మండల కమిటీ ఎన్నిక

టేక్మాల్(మెదక్): బీజేపీ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా నవీన్‌కుమార్‌ను, జిల్లా కార్యదర్శి శ్యామయ్య, ఫుల్ టైమర్ కృషి పండిట్, మాజీ మండలాధ్యక్షులు రాజు, శివగౌడ్‌ల సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిద్ధిరాములు, రాములు ఉపాధ్యక్షులుగా కే దుర్గయ్య, అంబయ్య, రాములు, శేఖర్‌గౌడ్, కార్యదర్శులుగా మోహన్, చంద్రశేఖర్, బేతయ్య, లింగం, నాగరాజు కోశాధికారిగా దుర్గాప్రసాద్, యువ మోర్చా అధ్యక్షుడిగా పవన్ కుమార్, దళిత మోర్చా అధ్యక్షుడిగా శంకర్, బీసీ మోర్చా అధ్యక్షుడిగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా అనిల్, శంకర్, శ్రీనివాస్, నాని, రమేశ్ యాదవ్, సాయిరాం, కుమార్ సురేశ్, ప్రభుకుమార్, ఆంజనేయులును నియమించారు.

◆ టీకాలు తప్పనిసరి

టేక్మాల్(మెదక్): సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఎంపీపీ స్వప్న పశువులకు టీకాలు ఇప్పించారు.

◆ ఆలయ అభివృద్ధికి రూ. 3లక్షల విరాళం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం వెంకటేశ్వర ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ట్రైడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి మూడు లక్షల రూపాయల విరాళం శుక్రవారం వేదపండితులు ప్రవీణ్‌శర్మకు అందజేశారు.

◆ గోమారం గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా కుంట లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం సంఘం ఎన్నికలు జిల్లా కోపరేటివ్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా లక్ష్మణ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కాముని గణేశ్, ఉపాధ్యక్షుడుగా పూస శంకర్, డైరెక్టర్లుగా బాలకృష్ణ, రాములు, పూస ఆంజనేయులు, భిక్షపతి, కుంట ఆంజనేయులు, నర్సింగ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ చిన్నారి కుటుంబానికి పరామర్శ

కౌడిపల్లి(నర్సాపూర్): ఈదురుగాలితో రేకులతో సహా ఎగిరిపోయి మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని మండల కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావ్, మాజీ ఎంపీపీ యాదాగౌడ్ తదితరులు చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, యాదాగౌడ్, ప్రభాకర్‌చారి, మల్లేశ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

◆ బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శుక్రవారం మెదక్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియమాకపత్రం అందజేశాడు. మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, చంద్రారెడ్డి, వెంకటేశం, నగేష్‌యాదవ్, పాండురంగారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ వేంకటేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. మాధవానంద స్వామి ప్రత్యేక పూజలు చేసి, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో గోవింద నామాలతో ఆలయం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, మాజీ ట్రైడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

◆ వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవాలు శుక్రవారం జరుపుకొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామ పురోహితుడు రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద హోమం, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి, మంత్రి శ్రీనివాస్, సంతోష్‌గౌడ్, జగన్, యాదాగౌడ్, మల్లేశం, రాజు, రాజాగౌడ్ ఉన్నారు.